క్లుప్తంగా

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి



ర్యాలీ చేస్తున్న దృశ్యం

పాణ్యం: బడిఈడు పిల్లలు బడిలో ఉండాలని ఎంఈఓ-2 సుబ్రమణ్యం అన్నారు. గురువారం స్థానిక గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులతో కలిసి ప్రిన్సిపాల్ క్రిష్టానాయక్ ఆధ్వర్యంలో పాఠశాల నుంచి బస్టాండ్ మీదుగా చెంచుకాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. చెంచు కాలనీలోని చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తోందని, బడిఈడు పిల్లలను బడికి పంపి బాగా చదివించుకోవాలని సూచించారు.

ఈవీఎంలపై అవగాహన



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పాణ్యం: మండల కేంద్రంలోని అయ్యపురెడ్డి కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఈవీఎంలపై అవగాహన కల్పించారు. ఏఎస్ఓ మహబూబ్‌బాషా, జూనియర్ అసిస్టెంట్ పార్వతి, వీఆర్ఓ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది ఈవీఎంల పని తీరు, ఓటు ఎలా వినియోగించుకోవాలి, కీ ప్యాడ్‌పై ఉండే పార్టీల గుర్తు తదితర అంశాలపై ఓటర్లకు వివరించారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

గూడూరు రూరల్: గ్రామాల అభివృద్ధి, పురోగతిపై సచివాలయ సిబ్బంది దృష్టి సారించాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. గురువారం జూలకల్‌లో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. ఉపాధి పనులు విరివిగా కల్పించాలన్నారు. కాలనీల్లో పారిశుద్ధ్య లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో ఈసీ పెంచలయ్య, కార్యదర్శి ప్రశాంతి పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల నిరసన

కర్నూలు(లీగల్): భూ యాజమాన్య హక్కు చట్టాన్ని ప్రభుత్వం విరమించుకోవాలనే డిమాండ్‌తో న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు నాలుగో రోజుకు చేరాయి. గురువారం నిరసన శిబిరంలో న్యాయవాదులు మధుబాబు, క్రిష్ణయ్య, రా జేష్, జగదీష్ బాబు, దేవేందర్ రెడ్డి కూర్చున్నారు. టీడీపీ నాయకులు టీజీ భరత్, గఫూర్‌మియ, సీపీఎం నాయకులు సంఘీభావం తెలిపారు. అలాగే శిబిరం పక్కన ప్రజా, కుల, రైతు, రాజకీయ నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం న్యాయవాదులు నిర్వహించారు. కాగా చట్టాన్ని రద్దు చేయాలని సీనియర్ న్యాయవాదులు పి.రామాంజనేయులు, కృష్ణ, మురళి మనోహర్, రవిగువేరా, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగభూషణం నాయుడు, జనరల్ సెక్రటరీ చక్రపాణి డిమాండ్ చేశారు.

హార్మోనిస్టు గురువుకు కేంద్ర మంత్రి సత్కారం



వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కర్నూలు కల్చరల్: నగరానికి చెందిన ప్రముఖ హార్మోనిస్టు గురువు పీజీ వెంకటేశ్వర్లును ఢిల్లీలో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి సత్కారించారు. అంతరించి పోతున్న పద్య నాటకాన్ని పునరుద్ధరించడంలో భాగంగా కేంద్ర సాంస్కృతిక శాఖ కళా దీక్షను ప్రారంభించింది. అందులో భాగంగా సాంస్కృతిక శాఖ ఆహ్వానం మేరకు రాష్ట్రం నుంచి పద్య నాటకం గురువుగా పీజీ వెంకటేశ్వర్లు ఢిల్లీ వెళ్లారు. బుధవారం రాత్రి కేంద్ర మంత్రి ఆయనను సత్కరించారు. టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న గురు శిష్య పరంపరలో భాగంగా త్వరలో కళాదీక్షను ప్రారంభించనున్నారు. ఇందులో పీజీ వెంకటేశ్వర్లు కేంద్ర సాంస్కృతిక శాఖ తరఫున గురువుగా వ్యవహరించనున్నారు. గురువుగా ఎంపికైన వెంకటేశ్వర్లును టీజీవీ కళాక్షేత్రం అధ్యక్ష కార్యదర్శులు పత్తి ఓబులయ్య, మహమ్మద్ మియ్యా అభినందించారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

ఆదోనిరూరల్: ఆస్పరి మండలం బిణిగేరికి చెందిన అడివి రాముడు అనే వ్యక్తి విరుపాపురం గ్రామ సమీపంలో కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తుండగా గురువారం తాలూకా పోలీసులు పట్టుకుని అరెస్టు చేసినట్లు తాలూకా ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు. సదరు వ్యక్తి నుంచి 90 ఎంఎల్. పరిమాణం గల 40 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

పేదల బాగోగులు పట్టని చంద్రబాబు

• కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు సిటీ: చంద్రబాబు నాయుడు ఏనాడూ పేదల బాగోగులు పట్టించుకున్న దాఖలాలు లేవని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. మంగళవారం కర్నూలు మండల పరిధిలోని ఉల్చాల గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ జగనే ఎందుకు కావాలి? అంశంపై జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎంపీపీ డి.వెంకటేశ్వమ్మ పాల్గొన్నారు. సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న తన పాదయాత్రలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి అయిన వెంటనే ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వచ్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి పేద పిల్లలకు ఇంగ్లీషు విద్యను ప్రవేశ పెడుతుంటే టీడీపీ నేతలు కోర్టుల్లో కేసులు వేశారన్నారు. ఇళ్ల స్థలాల విషయంలోనూ వారు కోర్టులను ఆశ్రయించి పేదల సొంతింటి కలను దూరం చేశారన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిన విధానాన్ని గుర్తుకు తెచ్చుకుని ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పాలన సాగిస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు డి.వాసు, ఉల్చాల సర్పంచ్ విద్యాసాగర్, స్థానిక నాయకులు గోకారి, షేక్ ఖాలం, వార్డు సభ్యులు మల్లకల్, రాముడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

సి.బెళగల్: ప్రభుత్వ పథకాలను, కార్యక్రమాలను అధికార యంత్రాంగం సమర్థవంతంగా అమలు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అధికారులకు సూచించారు. గురువారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల నిర్వహణ గ్రామ స్థాయి నుంచి ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు పథకాలను చేర్చేందుకు వలంటీర్లను, సచివాలయ ఉద్యోగులను సమన్వయ పరుస్తూ ముందుకెళ్లాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్, పంచాయతీ కార్యదర్శులు కృష్ణప్రసాద్‌నాయుడు, జగదీష్ పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

ఓర్వకల్లు: పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. ఈనెల 15న ఏఐకేఎస్ ఆధ్వర్యంలో జరిగే రైతు ప్రదర్శన, బహిరంగ సమావేశాన్ని జయప్రదం చేయాలని సీపీఎం చేపట్టిన జీపు జాతా రెండో రోజు ఓర్వకల్లు నుంచి కన్నమడకల, హుసేనాపురం, కాల్వ, బ్రాహ్మణపల్లె, శకునాల, తిప్పాయపల్లె గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ దేశంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. రైతు సమస్యలను బహిరంగ సభలో చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు చంద్రబాబు నాయుడు, సీఐటీయూ మండల నాయకులు సుధాకర్, నాయకులు నాగరాజు, శేషయ్య, ప్రజా సంఘాల కార్యకర్తలు ఎల్లరాజు,కేశాలు,మనోహర్ పాల్గొన్నారు.

గ్రామీణ డాక్ సేవకులకు శిక్షణ

కర్నూలు (న్యూటౌన్): ఏఎస్‌పీహెచ్ (హెడ్‌క్వార్టర్స్) ఫజులుర్ రహమాన్, ఏఎస్‌పీ (ఆర్) నూరుల్లా నేతృత్వంలో కొత్తగా నియమితులైన గ్రామీణ డాక్ సేవక్‌లకు ప్రారంభ శిక్షణ ఇస్తున్నట్లు పోస్టల్ ట్రైనర్ గిరిబాబు తెలిపారు. గురువారం స్థానిక హెడ్‌పోస్టాఫీసులోని కాన్ఫరెన్స్ హాలులో శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి.

సృజనాత్మకతను వెలికితీయాలి

• డీఈఓ రంగారెడ్డి



నమునాలను పరిశీలిస్తున్న డీఈఓ రంగారెడ్డి

కల్లూరు: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని డీఈఓ రంగారెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన పరిశీలించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు తయారు చేసిన నమూనాలను తిలకించి విద్యార్థులను అభినందించారు. డీఈఓ రంగారెడ్డి వెంట ఎంఈఓలు శ్రీనివాసులు, వనజకుమారి, చిన్నటేకూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ రామసుబ్బారెడి ఉన్నారు.

పథకాలను జీవనోపాధులుగా మలచుకోవాలి

సి.బెళగల్: మహిళలు ప్రభుత్వ పథకాల ద్వారా పొందే రుణాలను జీవనోపాధులుగా మలచుకోవాలని వైకేపీ సీసీ రాముడు అన్నారు. గురువారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో మండల మహిళ సమైఖ్యా (ఎంఎంఎస్) అధ్యక్షురాలు సృజన అధ్యక్షతన పొదుపు మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీ మాట్లాడుతూ నెలనెలా గ్రామైఖ్య సంఘాల సమావేశాలను నిర్వహించుకుని, సభ్యుల అవసరాలు, అంతర్గత రుణాల కేటాయింపు, రుణ సహాయాల పెంపు, రుణాల రీ షెడ్యూల్ వంటి అంశాలపై సమగ్రంగా చర్చించుకోవాలని సూచించారు.

నూతన సంఘం సభ్యుల ఎన్నిక

నూతన ఎంఎంఎస్ అధ్యక్షురాలిగా పోలకల్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాక్షులు కొత్తకోట కమలమ్మ, కార్యదర్శిగా సంగాల షాహీన్, సహాయక కార్యదర్శి ముడుమాల కర్రెమ్మ, కోషాధికారిణిగా కె.సింగవరం సుజాతలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీసీ శ్రీనివాసులు ఉన్నారు.

మూడో విడత రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): మూడో విడత రీసర్వేలో భాగంగా గ్రౌండ్ ట్రూతింగ్, వ్యాలిడేషన్ ప్రక్రియలను త్వరగా పూర్తి చేసి ఫైనల్ ఆర్ఓఆర్‌లను సిద్ధం చేయాలని, స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి ఆయన కలెక్టర్లు, జేసీలతో వివిధ సంక్షేమ పథకాల అమలుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రయోజిత కార్యక్రమాలకు అవసరమైన భూములను గుర్తించి సంబంధిత సంస్థలకు అప్పగించే ప్రక్రియలను వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ గోదాముల నిర్మాణంలో కర్నూలు ప్రథమ స్థానంలో ఉందని, తరువాత స్థానాల్లో పల్నాడు, నంద్యాల, అనంతపురం జిల్లాలు ఉన్నాయని చెప్పారు. త్వరలోనే రాష్ట్రంలో 150 జన్ ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తుపాన్‌తో నష్టపోయిన రైతులకు ఉచితంగా విత్తనాలు ఇవ్వడంతోపాటు తడిచిన, రంగుమారిన ధాన్యాలను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన మంత్రి జన జాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ పథకంలో ఆదివాసీలకు ఇళ్లు నిర్మించుకునేందుకు అవకాశం ఉందని, ఇల్లు లేని వారిని గుర్తించి లబ్ధిదారులను చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న కాలనీల్లో నిర్మాణంలో ఉన్న రెండో దశలో ఉన్న 4.18 లక్షల గృహాలను ఫిబ్రవరి మొదటి వారానికి పూర్తి చేయించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో కె.మధుసూదన్‌రావు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

మందులు, పరికరాలకు ప్రతిపాదనలు పంపండి



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): రోగులకు అవసరమైన అత్యవసర మందులు, వైద్య పరికరాలను కొనేందుకు సిద్ధంగా ఉన్నామని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను పంపించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి చెప్పారు. గురువారం కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ లెక్చర్ హాల్‌లో ఆసుపత్రిలో జరిగిన మరణాలపై వైద్యులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు సంబంధించిన వైద్యపరీక్షల్లో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల సంతకాలు ఉండేలా చూడాలన్నారు. సంబంధిత బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, రేడియాలజీ విభాగాల వైద్యపరీక్షలపై వైద్యుల సంతకాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. సమావేశంలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్ రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన పెరగాలి



విద్యార్థుల పళ్లను పరిశీలిస్తున్న ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్

కర్నూలు(హాస్పిటల్): ఫ్లోరోసిస్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ చెప్పారు. గురువారం ఆయన కల్లూరు మండలం లక్ష్మీపురం మండల పరిషత్ ఆదర్శ పాఠశాలలో ఫ్లోరోసిస్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫ్లోరోసిస్ వ్యాధి వల్ల దంతాలపై అడ్డంగా పసుపు రంగు గీతలు ఏర్పడతాయన్నారు. చాక్‌పీసు రంగులోకి మారి దంతాలు గుంతలుగా ఏర్పడి పిప్పిపళ్లుగా మారతాయన్నారు. తినే హారం సరిగా నమలలేక పోతారని, పోషకాహారలేమికి గురవుతారని, తలనొప్పి, ఇతరులను కలవలేకపోవడం, మాట్లాడలేకపోవడం లాంటి సమస్యలతో బాధపడతారని చెప్పారు. ఇలాంటి వారు టూత్‌పేస్ట్‌ను బటాని గింజంత మోతాదులో వేసుకుని ఉదయం సాయంత్రం రెండు పూటలా శుభ్రం చేసుకోవాలన్నారు. లక్ష్మీపురం యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ నిల్వ చేసిన జంక్‌ఫుడ్ తినడం వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. హైఫ్లోరైడ్ టూత్ పేస్ట్, నిల్వ ఉండే చిరుతిళ్లు, శీతల పానియాలు, రెడీమేడ్ చిప్స్, ప్యాకేజ్ ఆహార పదార్థాలలో అధికంగా ఫ్లోరైడ్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీదేవి, రామకృష్ణ, ఆరోగ్య కార్యకర్త ఎల్లమ్మ పాల్గొన్నారు.

మధ్యప్రదేశ్ మహిళల ముఠా అరెస్ట్

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు నగరంలో దొంగతనాలకు పాల్పడుతున్న మధ్యప్రదేశ్ మహిళల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 12న కర్నూలు నగరానికి చెందిన శంకరమ్మ అనే మహిళ బంగారు కొనుగోలు చేసేందుకు షరాఫ్‌బజార్‌కు వెళ్లింది. గమనించిన మధ్యప్రదేశ్‌కు చెందిన ముఠా సభ్యులు కిరణ్ వర్మ, సుమన్, సావిత్రివర్మ, శంకర్ మాటు వేసి శంకరమ్మ బ్యాగులో నుంచి రూ.50వేలు తస్కరించారు. ఆలస్యంగా గుర్తించిన బాధితురాలు ఆందోళనకు గురై ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు షరాఫ్‌బజార్‌లో సీసీ కెమెరాలను పరిశీలించారు. అందులో అనుమానాస్పదంగా కనిపించిన నలుగురిపై దృష్టి పెట్టి గాలింపు చేపట్టారు. గురువారం షరాఫ్‌బజార్ పరిధి లో తిరుగుతున్న వీరిని అదుపులోకి తీసుకుని విచారించారు. దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించడంతో కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

నేడు ఉపాధిపనులపై సామాజిక తనిఖీ

గడివేముల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో శుక్రవారం ఉపాధి పనులపై సామాజిక తనిఖీ కార్యక్రమం ఉంటుందని ఏపీఓ వెంకటరమణ గురువారం తెలిపారు. 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకు గ్రామస్థాయిలో జరిగిన పనులపై బహిరంగ సమావేశం ఉంటుందన్నారు. అలాగే పింఛన్ పొందుతున్న లబ్ధిదారులపై సోషల్ ఆడిట్ ఉంటుందన్నారు. ఉపాధి పనులపై అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఎస్సీ సెల్ జిల్లా తాత్కాలిక చైర్మన్‌గా లాజరస్

కర్నూలు(సెంట్రల్): ఏపీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆదేశాల మేరకు కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా తాత్కాలిక చైర్మన్‌గా ఎండ్లూరి లాజరస్‌ను నియమించినట్లు డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు తెలిపారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన నియామక పత్రాన్ని లాజరస్‌కు అందజేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష రోగులకు ప్రాధాన్యం

కర్నూలు(హాస్పిటల్): జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల ద్వారా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రెఫర్ చేయబడిన రోగులకు అధిక ప్రాధాన్యతనిచ్చి వైద్యం చేయనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి చెప్పారు. ఈనెల 13న విజయవాడలో నిర్వహించిన ప్రభుత్వ ఆసుపత్రుల సూపరింటెండెంట్ల సమావేశంలో చర్చించిన అంశాలను ఆయన గురువారం వెల్లడించారు. ఆసుపత్రిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల నుంచి రెఫర్ చేయబడిన రోగుల కోసం ప్రత్యేకంగా ఓపీ ఏర్పాటు చేశామని, అవసరమైతే వారిని ఆరోగ్యశ్రీ ద్వారా చేర్చుకుని చికిత్స చేస్తున్నట్లు తెలిపారు. వారికి రవాణా ఛార్జీలు సైతం చెల్లిస్తున్నామన్నారు. ఈ విషయమై రాష్ట్ర సమావేశంలో ప్రత్యేక సలహాలు అందజేశారన్నారు.

కోలుకోలేక మహిళ మృతి

ఆదోనిరూరల్: మండలంలోని కడితోట గ్రామానికి చెందిన బోయ అంజినమ్మ (52) కర్నూలులోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం రాత్రి మృతి చెందింది. గురువారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు పెద్దతుంబళం ఎస్ఐ చిన్నపీరయ్య తెలిపారు. అంజినమ్మ ఈనెల 9వ తేదీన ఉపాధి హామీ పనికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా అదే పనికి వెళ్లిన గ్రామానికి చెందిన వ్యక్తి వెనక నుంచి స్కూటర్‌తో ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలైంది. చికిత్స నుంచి ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక అంజినమ్మ మృతి చెందింది.

వివాహిత ఆత్మహత్య

కౌతాళం: పొదలకుంట గ్రామంలో వివాహిత వేధింపులకు తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన మీనమ్మ (22)ను అదే గ్రామానికి చెందిన భీమిరెడ్డికి ఇచ్చి ఏడు నెలల క్రితం వివాహం జరిపించారు. వీరి సంసారం మూడు నెలలు సాఫీగా సాగింది. తరువాత భర్తతో పాటు ఆ ఇంటి సభ్యుల నుంచి వేధింపులు మొదలయ్యాయి. వేధిపులు తాళలేక బుధవారం రాత్రి పుట్టినింటికి వచ్చిన మీనమ్మ పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తన కూతురి మృతికి అత్తింటి వారే కారణమని పేర్కొంటూ తల్లి కత్తి ఎల్లమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు మృతురాలి భర్త భీమిరెడ్డి, బావ నర్సింహులు, మామ రామిరెడ్డి, అత్త హనుమంతమ్మపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కేఎంసీ ఫ్రైడ్ ప్లాజాకు బహిరంగ వేలం



కేఎంసీ ఫ్రైడ్ ప్లాజాకు బహిరంగ వేలం నిర్వహిస్తున్న మున్సిపల్ రెవెన్యూ అధికారులు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని స్థానిక వెంకటరమణ కాలనీలో విశాలమైన పార్కింగ్, ఆధునిక వసతులతో ఇటీవలే నిర్మించిన నగరపాలక సంస్థ కేఎంసీ ఫ్రైడ్ ప్లాజా మున్సిపల్ షాపులకు గురువారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో బహిరంగ వేలం నిర్వహించారు. నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ, అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ పాల్గొన్నారు. వెంకటరమణ కాలనీలో మొదటి రోజు 18 మున్సిపల్ షాపులకు వేలం నిర్వహించారు. ఒకటి నుంచి 9 వ నంబర్ షాపుల వేలంలో పాటదారులు పాల్గొన్నారు. నగరపాలక సంస్థ నిర్ణయించిన ధరావత్తు కన్నా ఎక్కువ మొత్తంలో పోటీపడి పాడిన పాటదారులకు షాపులు కేటాయించారు. మొదటి రోజు నిర్వహించిన షాపుల వేలం ద్వారా నగరపాలక సంస్థకు రూ.1.33 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు వెంకటరమణ కాలనీలోని కేఎంసీ ఫ్రైడ్‌ప్లాజాలో వ్యాపారులకు అనువుగా ఉండే విధంగా అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. మెయిన్‌రోడ్డులోనే మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మించడంతో పాటు ఒకేసారి 50 కార్లు, 100 మోటార్ సైకిళ్లు పట్టే విధంగా పార్కింగ్ సౌకర్యం, మొదటి, రెండు అంతస్తులకు వెళ్లేందుకు లిఫ్ట్ సౌకర్యం, శుద్ధమైన తాగునీరు, అధునాతన మరుగుదోడ్లు వంటి సౌకర్యాలు కల్పించామన్నారు. మరో రెండు రోజుల పాటు బహిరంగ వేలం ఉంటుందని, వ్యాపారులు అవకాశాన్నివినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి జునీద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రాజేశ్వరరావు, వాజిద్, సుహేయిల్, రాజు పాల్గొన్నారు.

డెబిట్ కార్డు సదుపాయాన్ని పొందండి



డెబిట్ కార్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు కష్టమర్ల కోసం డెబిట్ కార్డును అందుబాటులోకి తెచ్చామని, ఈ సదుపాయాన్ని ప్రజలు సద్వినియోగంచేసుకోవాలని బ్యాంకు ఏపీ సర్కిల్ సేల్స్ హెడ్ అభిఅభిరూప్ చటర్జీ కోరారు. గురువారం కర్నూలులోని జోనల్ ఆఫీసులో డెబిట్‌కార్డు లాంఛింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బ్యాంకు డెబిట్ కార్డును వినియోగించి అన్ని బ్యాంకుల ఏటీఎంలలో నగదును ఉపసంహరించుకోవచ్చన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ షాపింగ్‌లలోనూ వినియోగించేందుకు సౌకర్యంగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో కర్నూలు జోన్ జోనల్ బిజినెస్ మేనేజర్ శ్రీకాంత్, పేమెంట్ బ్యాంకు జోనల్ మేనేజర్లు మధు, షేర్‌జాన్, గౌతమి, బి.వీరారెడ్డి, హిమజ, రామచంద్ర, డిస్ట్రిబ్యూటర్ రవి పాల్గొన్నారు.

చికెన్ వేస్టేజ్ టెండర్లు రద్దు చేయాలి



ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి వినతి పత్రమిస్తున్న సీపీఐ నాయకులు, చికెన్ షాపు యజమానులు

కల్లూరు: కర్నూలు నగరంలోని చికెన్ వేస్టేజ్ టెండర్లు రద్దు చేయాలని నగరంలోని చికెన్ షాప్ యజమానుల అసోసియేషన్ కన్వీనర్ వీరేష్, సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి కోరారు. గురువారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డిని స్వగృహంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చికెన్ వేస్టేజ్ టెండర్ల వల్ల తాము నష్టాన్ని ఎదుర్కొంటున్నామన్నారు. చికెన్ కోసం తీసుకువచ్చిన కోళ్లలో కొన్ని చనిపోతుంటాయని, ఆ నష్టాన్ని చికెన్ వేస్టేజ్ వల్ల కొంతమేర భర్తీ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కో-కన్వీనర్ రామకృష్ణారెడ్డి, సీపీఐ నాయకులు మల్లికార్జున, ఖాజా, శ్రీనివాసరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు



మాట్లాడుతున్న కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కల్లూరు అర్బన్ క్లస్టర్-1 అధ్యక్షుడు భీమా శంకర్‌రెడ్డి, కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 29వ వార్డు శరీన్‌నగర్‌లో ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు సచివాలయంలో సంక్షేమ పథకాల తెలిపే బోర్డును ఆవిష్కరించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు కృష్ణారెడ్డి, హుస్సేన్ ఆలం, పీడీ బాషా, భాగ్యమ్మ పాల్గొన్నారు.

సస్పెన్షన్ ఎత్తివేయాలని వినతి



ఆర్‌యూ ఇన్‌చార్జ్ వీసీకి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో విధులు నిర్వహిస్తూ సస్పెన్షన్‌కు గురైన కొంత మంది దళిత నాన్‌టీచింగ్ టైం స్కేల్ ఉద్యోగుల సస్పెన్షన్‌ను ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఆర్‌యూ నాన్‌టీచింగ్ టైం స్కేల్ ఉద్యోగుల సంఘం నాయకులు వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ పి.ఫజుల్ రహన్‌కు వినతి పత్రం అందజేశారు. ఉద్దేశ పూర్వకంగా ఒక విద్యార్థి సంఘం నాయకుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా వర్సిటీ అధికారులు దళిత ఉద్యోగులపై కక్ష సాధింపుగా విద్యార్హత పత్రాలను డీఈఓ కార్యాలయానికి పంపించి నాన్‌జెన్యూన్‌గా భావించి సస్పెన్షన్ చేశారని వీసీ దృష్టికి తీసుకెళ్లారు. వీసీకి వినతి పత్రం ఇచ్చిన వారిలో సంఘం అధ్యక్షులు సుంకన్న, ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగరాజు, సస్పెన్షన్‌కు గురైన బాధితులు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలి



వ్యక్తిత్వ వికాస, కెరీర్ కౌన్సిలింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కల్లూరు: ప్రణాళికా బద్ధంగా చదువుకుంటూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సెట్కూరు మేనేజర్ సత్యనారాయణ సూచించారు. గురువారం చిన్నటేకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో సెట్కూరు-యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస, ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ఉద్యోగ సాధనలో చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన ఉండాలన్నారు. ప్రిన్సిపాల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ యువత నైతిక విలువలు పాటిస్తూ, పట్టుదలతో కృషి చేసి విజయ శిఖరాలను చేరుకోవాలన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు రాజశేఖర్, సోహైల్ మాట్లాడుతూ ఉన్నత విద్యావకాశాలు, ప్రస్తుత ఉపాధి అవకాశాల గురించి విపులంగా తెలిజేశారు. యువత స్మార్ట్ ఫోన్‌ను ఎక్కువగా ఉపయోగిస్తూ, చదువుపై ధ్యాస ఉంచడం లేదని, ఫోన్‌లో గేమ్‌లకు, వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర సోషల్ మీడియా సాధనాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల వైఎస్ ప్రిన్సిపాల్ వీర ప్రతాప్, అధ్యాపకులు పాల్గొన్నారు.